




ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి నివాసంలో భోగి వేడుకలో పాల్గొన్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు హరీశ్‌రావు, ఎర్రబెల్లి దయాకర్‌రావు, సబితాఇంద్రారెడ్డి, ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, ముఠా గోపాల్, కాలేరు వెంకటేశ్, బండారి లక్ష్మారెడ్డి తదితరులు

## ప్రజల జీవితాల్లో భోగభాగ్యాలు కలగాలి: కేటీఆర్

*హైదరాబాద్, జనవరి 13 (నమస్తే తెలంగాణ): ప్రజల జీవితాల్లో భోగభాగ్యాలతోపాటు సం'క్రాంతి' సంతరించుకొని సుఖసంతోషాలతో వర్ధిల్లాలని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రజలకు ఆయన సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. భోగిమంటలు, పాడిపంటలు, పిండివంటలు, రంగవల్లులు, గంగిరెద్దుల ఆటపాటలు, పతంగుల రెపరెపలు ప్రతి మది పులకించిపోయేలా సాగాలని అభిలషించారు.*

# యూబీ బ్రాండ్ బీర్లు బంద్!

**విక్రయాలు అర్ధంతరంగా నిలిపివేసిన ప్రభుత్వం**

హైదరాబాద్, జనవరి 13 (నమస్తే తెలంగాణ): సంక్రాంతి పండగ వేళ తెలంగాణలో యూబీ బ్రాండ్ (కింగ్‌ఫిషర్, బడ్వైజర్) బీర్ల అమ్మకాలను నిలిపివేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్టు విశ్వసనీయంగా తెలిసింది. ఏ4 మద్యం దుకాణాలకు, బార్లకు కింగ్‌ఫిషర్ బీర్లను ఇవ్వవద్దని తెలంగాణ బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ (టీజీబీసీఎల్)మద్యం డిపో మేనేజర్లను ఆదేశించింది. తదుపరి ఉత్తర్వులు ఇచ్చేంతవరకు యూబీ బ్రాండ్ ఉత్పత్తుల అమ్మకాలు జరుపొద్దని ఆదేశించింది. దీంతో సోమవారం రాష్ట్రవ్యాప్తంగా మద్యం డిపోలలో యూబీ బ్రాండ్ కంపెనీ ఉత్పత్తులైన కింగ్‌ఫిషర్, క్వీన్‌ఫిషర్, హీనెకెన్, ఆమ్‌స్టెల్ బ్రాండ్‌ల విక్రయాలు రాష్ట్రవ్యాప్తంగా నిలిచిపోయాయి.

**సిండికేట్‌గా ప్రమోట్..?**

యూబీ కంపెనీకి, ప్రభుత్వానికి మధ్య అంతరం పెరిగిన నేపథ్యంలో పాత బకాయిలు ఇచ్చి, బేసిక్ ధరలు పెంచేంత వరకు రాష్ట్రంలో తమ కంపెనీ బీర్లను సరఫరా చేసేది లేదని యూబీ ప్రకటించింది. ఈ నేపథ్యంలో మద్యం వ్యాపారులు సిండికేట్‌గా మారి, నిర్దిష్ట బీరు ఉత్పత్తులను రాష్ట్రంలో ప్రమోట్ చేయాలని నిర్ణయించినట్టు సమాచారం. ఈ క్రమంలో బడ్‌వైజర్ బీర్లను వ్యూహాత్మకంగా అడ్డుకుంటున్నట్టు తెలిసింది. ఇందులో ఉత్తర తెలంగాణకు చెందిన కాంగ్రెస్ ఎమ్మెల్యే ఒకరు రింగ్‌లీడర్ వ్యవహరిస్తున్నట్టు ప్రచారం జరుగుతున్నది. రాష్ట్రంలో కింగ్‌ఫిషర్, బడ్‌వైజర్ బీర్లకే 60 శాతం మార్కెట్ ఉన్నది. సంక్రాంతి పండుగ నేపథ్యంలో ఈ బ్రాండ్స్ 80 శాతం మేర మార్కెట్‌ను ఆక్రమిస్తాయని అంచనా. ప్రస్తుతం మద్యం గోదాముల్లో, జిల్లా డిపోల్లో కలిపి 14 లక్షలకు పైగా కింగ్‌ఫిషర్ బీర్ కేసులు ఉన్నాయి. పండుగకు ఈ స్టాక్ సరిపోతుందని, ఎక్సైజ్ వర్గాలు చెప్తున్నాయి. కానీ వీటి స్థానంలో కొత్త బ్రాండ్‌లను ప్రోత్సహించేందుకు పావులు కదుపుతున్నారని ప్రచారం జోరుగా సాగుతున్నది. అందులో భాగంగానే రాష్ట్రంలో రెండో స్థానంలో ఉన్న ఆర్‌సీ, నాకౌట్, హైవార్డ్స్ 5000, ఖర్జూర తదితర బీరు బ్రాండ్లను ప్రమోట్ చేయాలని నిర్ణయించినట్టు ప్రచారం జరుగుతున్నది.

## తెలంగాణ టుడే సీనియర్ జర్నలిస్ట్ అనిల్ కన్నుమూత

- విహారయాత్రలో గుండెపోటుకు గురై అకాలమరణం
- మాజీ సీఎం కేసీఆర్ సహా పలువురి సంతాపం



అనిల్‌కుమార్

హైదరాబాద్, జనవరి 13 (నమస్తే తెలంగాణ)/సిటీ బ్యూరో : తెలంగాణ టుడే సీనియర్ జర్నలిస్ట్ అనిల్‌కుమార్ (55)గుండెపోటుతో మరణించారు. ఆయన 2022 నుంచి తెలంగాణ టుడే ఆంగ్ల దినపత్రికలో పనిచేస్తున్నారు. 30 ఏండ్లుగా జర్నలిజం వృత్తిలో ఉన్న ఆయన 1994లో న్యూస్‌లైన్ రిపోర్టర్‌గా తన ప్రస్థానాన్ని ప్రారంభించారు. ఇండియన్ ఎక్స్‌ప్రెస్, డెయిలీ హిందీ మిలాప్, టీఎన్‌టీఈ, స్వతంత్రవార్త పత్రికల్లో పనిచేశారు. కుటుంబంతో కలిసి కర్నాటకకు విహార యాత్రకు వెళ్లారు. గోర్ణలోని మురుడేశ్వర ఆలయంలో ఉండగా గుండెపోటు వచ్చింది. దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ మరణించారు.

**ప్రముఖుల సంతాపం..**

అనిల్‌కుమార్ మరణంపై బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనిల్ ఆత్మకు శాంతి చేకూరాలని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రార్థించారు. ఆయన కుటుంబానికి సానుభూతి తెలిపారు. జర్నలిజం రంగానికి అనిల్‌కుమార్ విలువైన సేవలు అందించారని మాజీ ఎంపీ సంతోష్‌కుమార్ పేర్కొన్నారు. అనిల్‌కుమార్ మృతిపై సీఎం రేవంత్,మంత్రులు పొంగులేటి, సీతక్క సంతాపం తెలిపారు.

# మందా జగన్నాథంకు కన్నీటి వీడ్కోలు

**ఆత్మీయుల అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు • కేటీఆర్ నివాళులు, కుటుంబానికి ఓదార్పు**



మాజీ ఎంపీ మందా జగన్నాథం భౌతికకాయానికి పుష్పాంజలి ఘటించి, కుటుంబ సభ్యులను ఓదార్చుతున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

చంపాపేట అలంపూర్, జనవరి 13: ఆత్మీయులు, అభిమానులు, కుటుంబ సభ్యుల అశ్రునయనాల మధ్య నాగర్‌కర్నూల్ మాజీఎంపీ ఎంపీ మందా జగన్నాథం అంత్యక్రియలు సైదాబాద్‌లోని మహాప్రస్థానంలో జరిగాయి. కొంతకాలంగా అనారోగ్యంతో నిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి చెందిన మందా జగన్నాథం భౌతికకాయాన్ని చంపాపేటలోని స్వగృహానికి తరలించగా అక్కడ వివిధ రాజకీయపార్టీల నేతలు, బంధుమిత్రులు నివాళులర్పించారు. కడసారి చూపు చూసి పుష్పాంజలి ఘటించారు. మందా జగన్నాథం భౌతికకాయాన్ని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సందర్శించారు. పూలమాల వేసి నివాళులర్పించారు. మందా జగన్నాథం కుటుంబాన్ని పరామర్శించి, ఓదార్చారు. అనంతరం మాట్లాడుతూ రాజకీయాల్లో అజాతశత్రువుగా, సౌమ్యుడిగా గుర్తింపు పొందిన మందా జగన్నాథం అందరి ఆప్తుడు అని కొనియాడారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో రాజకీయంగా మందా తనదైన శైలిలో చెరగని ముద్ర వేశారని స్మరించుకున్నారు. బీఆర్‌ఎస్ ఓ నిఖార్సయిన సీనియర్‌నేతను కోల్పోయిందని, అలాంటి రాజకీయనేత ఇకలేరన్న విషయం జీర్ణించుకోలేనిదని ఆవేదన వ్యక్తంచేశారు. మందా జగన్నాథం కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యం ఇవ్వాలని ప్రార్థించారు. మందా జగన్నాథం భౌతికకాయానికి మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి, తెలంగాణ ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి నివాళులర్పించారు. మందా కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మందా జగన్నాథంకు ఐఎస్ సదన్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సామ స్వప్న సుందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ చంపాపేట డివిజన్ అధ్యక్షుడు ముడుపు రాజ్‌మార్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వర్, స్థానిక డివిజన్ నాయకులు కట్ట వెంకటేశ్, వింజమూరి రాఘవాచారి తదితరులు పాల్గొన్నారు.



మందా జగన్నాథం కుటుంబ సభ్యులను ఓదార్చుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

## తాగునీటి కోసం ఆందోళన



*మూడు నెలలుగా తాగునీటి సమస్య వేధిస్తున్నా అధికారులు పట్టించుకోవడంలేదని నిజామాబాద్ జిల్లా కోటగిరి మండలం టాక్లీ గ్రామంలోని ఎస్సీ కాలనీ వాసులు ఆగ్రహం వ్యక్తంచేశారు. సోమవారం టాక్లీ నుంచి కోటగిరికి తరలివచ్చి.. అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.*

*–కోటగిరి*




# పొంగులేటిని నిలదీసిన గిరిజనులు

- అనర్హులకు ఇండ్లు ఎలా ఇచ్చారు?
- చుట్టుముట్టిన బాధిత కుటుంబ సభ్యులు
- జాబితాను మార్చేశారని మండిపాటు
- పేర్లు ఎందుకు తొలగించారని నిలదీత
- అధికారులపై పొంగులేటి ఆగ్రహం
- విచారించి అర్హులకే ఇవ్వాలని ఆదేశం



ఖమ్మం జిల్లా దుబ్బతండాలో ఇందిరమ్మ ఇండ్ల జాబితాపై మంత్రి పొంగులేటిని నిలదీస్తున్న ప్రజలు

ఖమ్మం, జనవరి 13 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఇందిరమ్మ ఇండ్లు అనర్హులకు ఎలా ఇస్తారంటూ గిరిజనులు గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని చుట్టుముట్టారు. అన్ని అర్హతలు ఉన్న తమను కాదని, పైగా ఎంపిక జాబితాలో ఉన్న పేర్లను తొలగించి అనర్హులకు ఇండ్లు కట్టబెట్టారంటూ నిలదీశారు. ఇందిరమ్మ ఇండ్ల మంజూరులో పారదర్శకంగా వ్యవహరిస్తామని, అర్హులకు అన్యాయం జరుగనీయబోమని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన కొద్దిరోజులకే ఇందిరమ్మ ఇండ్ల మంజూరులో డొల్లతనం, పక్షపాత ధోరణి బయటపడింది. మంత్రి శ్రీనివాసరెడ్డి ఎదుట ఓ గిరిజన కుటుంబం సాక్ష్యాధారాలతో సహా ఈ తప్పిదాన్ని ఎత్తిచూపింది. అర్హుల జాబితా నుంచి తమను ఎందుకు తొలగించారో చెప్పాలని నిలదీసింది. ఈ ఘటన ఖమ్మం జిల్లాలోని సాక్షాత్తూ మంత్రి సొంత నియోజకవర్గమైన పాలేరులోనే చోటుచేసుకున్నది. పాలేరు నియోజకవర్గంలోని కూసుమంచి మండలం దుబ్బతండాలో ఇందిరమ్మ ఇండ్లను సోమవారం ప్రారంభించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి.. వాటిని లబ్ధిదారులకు అందజేశారు. ఇండ్ల ప్రారంభ కార్యక్రమంలో అర్హుల పేర్లు తొలగించడాన్ని, అనర్హుల పేర్లు జాబితాలో వెల్లడించడాన్ని గమనించిన ఓ గిరిజన కుటుంబం వెంటనే మంత్రి ఎదుటే నిరసనకు దిగింది. అర్హుడినైన తనకు ఇల్లు ఎందుకు ఇవ్వలేదంటూ అదే తండాకు చెందిన బోడా సేవా, అతడి తల్లి, భార్య అక్కడే ఆందోళనకు దిగారు. అర్హుల జాబితాలో ఆదివారం తన పేరును ప్రకటించిన అధికారులు.. సోమవారం ఇండ్ల ప్రారంభోత్సవం నాటికి జాబితా నుంచి తన పేరును ఎందుకు తొలగించారని ప్రశ్నించారు. కుటుంబ సభ్యులతోపాటు మహిళలు మంత్రి పొంగులేటిని చుట్టుముట్టారు. సాగు భూములు ఉన్న వారికి కూడా ఈ ఇండ్లల్లో చోటుకల్పించినట్టు ఫిర్యాదు చేశారు. కానీ సాగు భూమి, ఇల్లు కోల్పోయిన తమకు ఇందిరమ్మ ఇల్లు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. తమ అర్హతను పరిశీలించి ఇల్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో సంబంధిత అధికారులపై మంత్రి పొంగులేటి ఆగ్రహం వ్యక్తంచేశారు. లబ్ధిదారులను ఎవరు ఎంపిక చేశారని ప్రశ్నించారు. ఎంపిక విధానం పారదర్శకంగా ఉండాలని, అర్హులకే ఇండ్లు ఇవ్వాలని సూచించారు. ఈ ఇండ్ల కేటాయింపు, లబ్ధిదారుల ఎంపికపై మరోసారి విచారణ చేపట్టాలని ఆదేశించారు. ఇప్పుడు రాని వారికి మరో దఫాలో ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని మాట ఇచ్చారు.